సాక్షి గుంటూరు

బుధవారం, 13, నవంబర్, 2024



మర్యాదపూర్వక కలయిక

నెహ్రూనగర్:మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి కె.కన్న బాబును గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం కలిశారు.



జెడ్పీని సందర్శించిన కృష్ణతేజ

గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనర్ ఎంటీఆర్ కృష్ణ తేజ మంగళవారం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించారు.

వెండి సర్వాభరణాలు విరాళం



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డు బాలయ్య నగర్‌లోని కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి రూ.7లక్షల విలువైన వెండి సర్వాభరణాలను పట్టణానికి చెందిన భడభాగ్ని శ్రీనివాస రావు, భువనేశ్వరి దంపతులు అందజేశారు.

న్యూస్‌రీల్

నృసింహస్వామి గ్రామోత్సవం



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి చిలుక ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం గరుడ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమించారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవారు గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వగా భక్తులు టెంకాయలు కొట్టి ప్రసాదాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 20న సమావేశాన్ని నిర్వహించాల్సి ఉండగా, బడ్జెట్ సమావేశాల దృష్ట్యా 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

16న షూటింగ్ బాల్ పోటీలు

తాడికొండ: ఈనెల 16న తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ అండర్-17, 19 పోటీలు నిర్వహించనున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్ తెలిపారు. వివరాలకు ఫోన్: 8639922978 నంబర్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

ఉత్తుత్తి ఉద్యోగోన్నతులు !

- టీచర్ల ప్రమోషన్లలో ట్విస్ట్
- పేరుకే పదోన్నతి.. పాత పోస్టులోనే పని
- గుంటూరు జిల్లాలో ఏడుగురికి హెచ్‌ఎంలుగా పోస్టింగ్
- కొత్త విధుల్లో చేరిన రోజే రిలీవై మళ్లీ స్కూల్ అసిస్టెంట్లుగా వెళ్లిన విచిత్ర పరిస్థితి
- ప్రభుత్వ అస్తవ్యస్త విధానానికి నిదర్శనం



గుంటూరులోని వేణుగోపాల్‌నగర్ హైస్కూల్లో సోమవారం ఉదయం హెచ్‌ఎంగా విధుల్లో చేరి, సాయంత్రం రిలీవ్ అయిన పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం అస్తవ్యస్త విధానంతో ఉద్యోగోన్నతుల ప్రక్రియను అపహాస్యం చేస్తోంది. మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి వారిని గతంలో పనిచేసిన పాఠశాలలోనే పనిచేయాలని ఆదేశిస్తోంది. దీంతో గ్రేడ్-2 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క రోజు హెచ్‌ఎంలే!

గుంటూరు నగరపాలకసంస్థతో పాటు జిల్లాలోని మున్సిపాల్టీల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఈనెల 8న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉన్నతాధికారులు ఉద్యోగోన్నతి కల్పించారు. వీరిలో గుంటూరు, నరసరావుపేట, పొన్నూరుల్లో ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు, తెనాలిలో నలుగురు ఉన్నారు. సోమవారం వీరంతా కొత్త పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదే రోజు సాయంత్రం విధుల నుంచి రిలీవయ్యారు. ఇప్పటి వరకు పని చేసిన పాఠశాలలకు తిరిగి వెళ్లి స్కూల్ అసిస్టెంట్లుగా బోధన ప్రారంభించారు. ఈ ఉద్యోగోన్నతుల వల్ల లాభమేంటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

విద్యాసంవత్సరం మధ్యలో ప్రమోషన్ల వల్లే దుస్థితి!

విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టడం వల్ల సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా వెళ్తే పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలుగుతోందనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు తిరిగి పాత పోస్టులకే వెళ్లి బోధించాలని ఆదేశించారు. విద్యాసంవత్సరం ముగిసే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే గ్రేడ్-2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతులతో ఖాళీగా మారిన స్థానాలను ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేసేందుకు మంగళవారం గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ రేణుక ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 9 మంది ప్రమోషన్లు పొందారు. వీరు కూడా విద్యాసంవత్సరం ముగిసే వరకు పాత పోస్టుల్లోనే పనిచేయాలి.

ఇన్‌చార్జి హెచ్‌ఎంల విముఖత

గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేయడంతో హైస్కూళ్లలో ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తీరా ప్రమోషన్‌పై వచ్చిన వారు మళ్లీ పాత పాఠశాలలకే వెళ్లడంతో తిరిగి ఇన్‌చార్జులుగా బాధ్యతలు చేపట్టేందుకు వారు విముఖత చూపుతున్నారు.

ఉద్యోగోన్నతులకు అర్థం లేదు

మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతులు లేవు. ఉద్యోగోన్నతులు కల్పించిన ప్రభుత్వం తిరిగి వారిని పాత పాఠశాలల్లో పాత స్థానాల్లోనే పని చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం బాధాకరం. హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో హైస్కూళ్లలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పోస్టులను భర్తీ చేసినట్టే చేసి ఉపాధ్యాయులకు ఉపయోగం లేకుండా చేశారు.

– బి.హైమారావు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మిర్చి రవాణా వివాదాలు పరిష్కరించుకోవాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్ తేజ

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి బస్తాల రవాణా విషయంలో వివాదాలు లేకుండా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్, మిర్చి యార్డు పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ్ ఆదేశించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, లారీ ఓనర్స్ అసోసియేషన్లతో మంగళవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. జేసీ భార్గవ్ తేజ మాట్లాడుతూ లారీ కిరాయి విషయంలో మిర్చి ఎగుమతి వ్యాపారులు, లారీ ఓనర్ల మధ్య వివాదాలు లేకుండా చూసుకోవాలన్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చి లోడ్ చేసిన మిర్చి లారీలను, తక్కువ ధరకు పెట్టే లారీలను ఆపడం సరికాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కిరాయి విషయం ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. మిర్చి ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు జుగిరాజ్ భండారీ, కొత్తూరి సుధాకర్, వైఆర్‌కే శ్రీనివాస్‌లు మాట్లాడుతూ లారీల సమస్యతో ఐదేళ్లుగా గుంటూరులో ఉన్న మిర్చి వ్యాపారులు దెబ్బతింటున్నారని పేర్కొన్నారు. పలువురు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పెరిగిన ట్యాక్స్‌లతో లారీలు నడపడం భారంగా మారిందన్నారు. లారీ కిరాయిని నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు, రవాణాశాఖ డెప్యూటీ కమిషనర్ కె.సీతారామిరెడ్డి, ఆర్టీఓ సత్యనారాయణ ప్రసాద్, డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి



కార్యక్రమంలో పాల్గొన్న లీలావతి, చిత్రంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి టి.లీలావతి చెప్పారు. మంగళవారం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలను లీలావతి సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ విష సంస్కృతి అని పేర్కొన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని స్పష్టం చేశారు. దుష్పరిణామాలను వివరించారు. యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ ప్రతి కాలేజీలో అందుబాటులో ఉండాలని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ కె.ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకంటూనే కేసులేంటీ?

గోరంట్ల నగరాలులో ట్రాక్టర్ల డ్రైవర్ల నిరసన



ఇసుక ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డుగా నిలిపిన దృశ్యం

గుంటూరు రూరల్: ప్రభుత్వం ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని చెబుతుంటే అధికారులు ఆపి కేసులు రాస్తున్నారని, బిల్లులు చూపాలని వేధిస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు, పోలీసులు గోరంట్లలోని నగరాలు వద్ద అడ్డుకున్నారు. బిల్లులు, పత్రాలు చూపించాలని ప్రశ్నించారు. దీంతో అమరావతిరోడ్డు నగరాలు నుంచి గోరంట్ల వరకూ రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్లు పెట్టి ఓనర్లు, డ్రైవర్లు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతున్నా.. రీచ్‌లలో ఇసుక లోడింగ్, ఇతర ఖర్చులు అంటూ వేల రూపాయలు తీసుకుంటున్నారని, బిల్లులు ఏమీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా సమయంలోనూ అధికారులు తనిఖీల పేరుతో వేధిస్తున్నారని, రూ.వేలల్లో జరిమానాలు విధిస్తున్నారని ఉచిత ఇసుక బూటకమేనా అంటూ ప్రశ్నించారు. సమాధానం చెప్పాలంటూ రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ సుమారు రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో పోలీసులు ఈసారికి వదిలేస్తున్నామని, ఇక నుంచి బిల్లులు లేకుంటే ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నాలుగు రోజుల్లోనే భారీ చోరీ కేసు ఛేదన

- చిన్న సాంకేతిక ఆధారంతో దొంగలను పట్టుకున్న పోలీసులు
- నిందితులిద్దరూ మహిళలే
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జనార్దనరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, చిత్రంలో సీఐ మల్లికార్జునరావు

తెనాలిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసును తెనాలి వన్‌టౌన్ పోలీసులు కేవలం నాలుగు రోజుల్లోనే ఛేదించారు. ఘటనా స్థలంలో లభించిన చిన్న సాంకేతిక ఆధారంతో నిందితులను చాకచక్యంగా గుర్తించి అరెస్టు చేశారు. చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తెనాలి వన్ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సీఐ మల్లికార్జునరావుతో కలిసి డీఎస్పీ జనార్దనరావు ఈ కేసు వివరాలను విలేకరులకు వివరించారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక రామలింగేశ్వరపేట తోటావారివీధికి చెందిన పురోహితుడు విష్ణుభట్ల మల్లికార్జున శర్మ కుటుంబం గతనెల 31న ఇంటికి తాళం వేసి తణుకు వెళ్లింది. ఈనెల 7న ఇంటి తలుపులు తెరిచి ఉండటం చూసిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన తెనాలి వచ్చిన మల్లికార్జునశర్మ తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. భారీ మొత్తంలో చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది. దర్యాప్తు చేపట్టిన సీఐ మల్లికార్జునరావు చిన్న సాంకేతిక ఆధారంతో వేమూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసును పరిశీలించి చోరీకి పాల్పడింది బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవించే శీలం రోశమ్మ, శీలం మహంకాళమ్మగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన 80 గ్రాముల రెండు బంగారు గొలుసులు, నాలుగున్నర కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా నిందితులను గుర్తించిన సీఐ మల్లికార్జునరావును డీఎస్పీ అభినందించారు.

రేపటి నుంచి పుస్తక మహోత్సవం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఈనెల 14 నుంచి డిసెంబర్ 13 వరకు గుంటూరులో పుస్తక మహోత్సవం విశాలాంధ్ర బుక్ హౌస్ గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. ఈ పుస్తక మహోత్సవంలో 40 రకాల ప్రచురణ సంస్థలు ప్రచురించిన 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రఖ్యాత రచయితల రచనలు, ఆధ్యాత్మిక, వాస్తు శాస్త్ర, గ్రంథాలతోపాటు పాపులర్ సైన్స్ గ్రంథాలు ఇంగ్లిష్, తెలుగు భాషల్లో లభిస్తాయని, అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు కూడా ఉంటాయని వివరించారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు మహోత్సవం ఉంటుందని, పుస్తకాలపై 10 శాతం రిబేటు ఇవ్వనున్నట్లు తెలిపారు. పుస్తక మహోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 1 నుంచి సాయంత్రం 6 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.